క్లుప్తంగా

దశభుజ గణపతికి పూజలు


అలంకరణలో దశభుజ గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు బస్టాండ్ ఎదురుగా ఉన్న జామియా మహమ్మదీయ అరబిక్ కాలేజీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జమీయత్ ఏ అహ్లహదీస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అమీన్, ట్రెజరర్ నజీరుల్‌హక్ ఆదివారం తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. కంటి జబ్బులతో బాధపడుతున్న వారు శిబిరానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పట్టణ సీఐ తేజమూర్తి బదిలీ!



కళ్యాణదుర్గం: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిద్ద తేజమూర్తి బదిలీ అయ్యారు. 2021 ఏప్రిల్ 23న కళ్యాణదుర్గంలో బాధ్యతలు చేపట్టిన ఆయన మూడేళ్లకు పైగా విధులు నిర్వర్తించారు. సర్వీసు రూల్స్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలుకు బదిలీపై వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా తేజమూర్తి కళ్యాణదుర్గం ప్రాంతంలో శాంతి భద్రతల విషయంలో తనకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఉమ

ఉరవకొండ/వజ్రకరూరు: ఉరవకొండలోని ప్రభుత్వ ప్రధాన గ్రంథాలయాన్ని ఆ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయల్లో నూతన పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవసరమైయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠకులకు గ్రంథాలయాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆమె వజ్రకరూరు గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు.

చోళసముద్రం చెరువుకు జలకళ


చోళసముద్రం చెరువుకు చేరిన కృష్ణా జలాలు

కూడేరు: మండలంలోని చోళసముద్రం మినీ చెరువుకు జలకళ వచ్చింది. పి.నారాయణపురం సమీపంలో హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి. పది రోజులు క్రితం చోళసముద్రం చెరువుకు అధికారులు నీరు విడుదల చేశారు. దీంతో కృష్ణా జలాలు చెరువులోకి చేరుతున్నాయి. చెరువులో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెంపొందుతాయని రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధుడికి గాయాలు


రెండు కాళ్లు దెబ్బతిన్న ఎల్లప్ప

రాయదుర్గం టౌన్: ఎద్దులబండిపై వెళ్తూ టైర్ పంక్చర్ అయి కిందపడడంతో ఓ వృద్ధుడికి రెండు కాళ్లు దెబ్బతిన్న ఘటన రాయదుర్గం మండలంలోని రాతిబావివంక గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈఘటనలో రాతిబావివంక గ్రామానికి చెందిన ఎల్లప్ప(64) గాయపడ్డాడు. వివరాలు.. గ్రామానికి సమీపంలో తన కుమారుడి ఇంటి నిర్మాణం కోసం బేస్‌మట్టానికి నీరు వదిలి గ్రామానికి ఎద్దుల బండి వెళుతుండడంతో ఎక్కాడు. ఆకస్మిత్తుగా బండి టైరు బరస్ట్ అయింది. ఆ సమయంలో బండిపై ఉన్న ఎల్లప్ప ఒక్కసారిగా కింద పడడమే కాక, అతని కాళ్లపై టైర్ రిమ్ పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం అతడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు.

కాసుల కక్కుర్తి..!

- మీ సేవ కేంద్రాల్లో అడ్డగోలు పనులు
- పేరొకరిది...నిర్వహణ మరొకరు...!
- టీడీపీ హయాంలో ఇష్టానుసారంగా మీ సేవా కేంద్రాలు
- క్రిమినల్ కేసు పెట్టినా తగ్గని నిర్వాహకులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో కొందరు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అడ్డుగోలు పనులు చేస్తూ ఇటీవల విజిలెన్స్ అధికారులు చిక్కారు. తమకున్న అతి తెలివిని ఉపయోగించి కాసుల కోసం కక్కుర్తి పడ్డారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నారంటూ పలు మీ సేవా కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు ఇటీవల తనిఖీ చేసి క్రిమినల్ కేసులు పెట్టినా దర్జాగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇదంతా కేవలం మీ సేవ కేంద్రాలు టీడీపీ నేతల పేర్ల మీద ఉండటమే కారణమని పలువురు చెబుతున్నారు.

పేరొకరిది...నడిపేది ఇంకొకరు

కళ్యాణదుర్గంలో విజిలెన్స్ అధికారులు సోదాలు జరిపిన మీ సేవ కేంద్రాలు రెండూ టీడీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అండతో నేతలు తమ పేర్ల మీదనే మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో మీ సేవా కేంద్రం నిర్వాహకులు సెంటర్‌లో లేకపోవడం, మీ సేవ కేంద్రం ఒకరి పేరున ఉంటే మరొకరు నడపడం వంటి వాటిని పరిశీలించారు.

మీ సేవ ముసుగులో చట్ట వ్యతిరేక పనులు

విజిలెన్స్ అధికారులు సోదాలు చేసిన చైత్ర మీ సేవ


విజిలెన్స్ అధికారులు క్రిమినల్ కేసు పెట్టిన చైత్ర మీ సేవ కేంద్రం

కేంద్రం నిర్వాహకుడు జీఎం హరికృష్ణ (ఐడీ: ఎఫ్‌ఏపీ 047) మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరికి స్వయానా బంధువు. మరొకటి శ్రీ బసవ మీ సేవ కేంద్రం ఉన్నంకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న పార్టీ సీనియర్ నాయకుడు ఆర్‌జీ శివ శంకర్ (ఐడీః ఎఫ్‌ఏపీ 032) నడుపుతున్నారు. ఈ రెండు కేంద్రాల్లో చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నట్లు


విజిలెన్స్ సోదాలు చేసిన బసవ మీ సేవ కేంద్రం

విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నకిలీ పత్రాలు చేసేందుకు అవసరమైన సీల్లు ఎందుకు తయారు చేయించారు..? సంతకం చేసిన ఖాళీ నాన్– జ్యుడిషియల్ బాండ్ పేపర్లు ఎందుకు ఉన్నాయి..? ఇతరులకు చెందిన ఆధార్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు ఎందుకు ఉంచుకున్నారు..? పట్టాదారు పాసు పుస్తకాలు పదుల సంఖ్యలో మీ సేవ కేంద్రాల్లో ఉంచుకోవడం పలు అమనుమానాలకు తావిస్తోంది.

మీ సేవ ముసుగులో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారంటూ ఏకంగా విజిలెన్స్ అధికారులు చైత్ర మీ సేవా కేంద్రంపై క్రిమినల్ కేసు పెట్టారంటే ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థమవుతోంది.

అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం

ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలనే సంకల్పంతో మరింత జవాబుదారీ తనంగా ఉండేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. జగనన్న సురక్ష పథకం ద్వారా అన్ని రకాల ధృవీకరణ పత్రాలు సైతం ఉచితంగా అందజేస్తోంది. అయితే సోదాలు జరిగిన మీ సేవ కేంద్రాల్లో లక్షలాది రూపాయలు వేతనం తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఇన్‌కం సర్టిఫికెట్లను అందించినట్లు అధికారులు గుర్తించారు. దీనికి తోడు పేదలకు ఉచితంగా అందించే రైస్ కార్డులు సైతం ఖాళీవి మీ సేవ కేంద్రాల్లో లభ్యమవుతుండటం రెవెన్యూ అధికారులను విస్మయానికి గురి చేస్తోంది. ఖాళీ రైస్ కార్డులు ఎక్కడి నుంచి తెచ్చుకున్నారు..? ఎలా వచ్చాయనేది ప్రశ్నార్థకం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్న మీ సేవ కేంద్రాలపై ఉక్కుపాదం మోపాలని మేధావులు కోరుతున్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక


ములకలేడులో మాట్లాడుతున్న శ్రీచరణ్

శెట్టూరు: కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముక వంటివారని, పార్టీ మరింత పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త, ఆ పార్టీ నాయకుడు శ్రీచరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని ములకలేడు, తిప్పనపల్లి, అనుంపల్లి, కనుకూరు, చింతర్లపల్లి, మాకోడికి, చెర్లోపల్లి, కైరేవు, బచ్చేహళ్లి, చిన్నంపల్లి, యాటకల్లు తదితర గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. ఆంధ్రకు జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమానికి కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. టీడీపీ నేతల కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ, పార్టీ మండల కన్వీనర్ శివన్నయాదవ్, మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, జేఏసీ కన్వీనర్ తిమ్మరాజు, నాయకులు పోస్ట్ రామకృష్ణ, హరినాథ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ విజయం కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ సూచించారు. ఆదివారం మండలంలోని ఎనుములదొడ్డి, మహంతపురం, కుందుర్పి, అప్పిలేపల్లి తదితర పంచాయతీల్లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వైఎస్సార్‌సీపీ విజయానికి చేపట్టాల్సిన చర్యలపై కార్యకర్తలతో మంత్రి మాట్లాడారు. 'ఆంధ్రకు జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి' అనే కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు సంసిద్ధులు కావాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పలు సంక్షేమ పథకాలు అందించి ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచులు మారుతేశ్వరి, గంగాధర, జగన్, మహదేవమ్మ, గోపాల్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

విడపనకల్లు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమావేశం భవనంలో ఆదివారం రెవెన్యూ అధికారులు ప్రపంచ వృద్ధ్యాప్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులను సత్కరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 26వ పోలింగ్ స్టేషన్‌కు చెందిన సీనియర్ ఓటర్లు టి.తిమ్మప్ప, బండారు హుస్సేన్‌ను సీనియర్ అసిస్టెంట్ వన్నప్ప, రెవెన్యూ అధికారులు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న తదితరులు సత్కరించారు.

4,075 మందికి పింఛన్ల పంపిణీ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా సామాజిక భద్రత పథకంలో 6,285 వివిధ రకాల పింఛన్ దారులుండగా ఆదివారం 4,075 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. తెల్లారకమునుపే ఇంటివద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' రేపు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సచివాలయం, ఆర్బీకే ప్రారంభోత్సవం రేపు

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.40 లక్షలతో పూర్తయిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ కేంద్రాలను మంగళవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు సర్పంచ్ కోట్ల ఉమేష్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటో, బైక్ ఢీ

శెట్టూరు: మండలంలోని కైరేవు, బచ్చేహళ్లి గేట్ మధ్య ప్రధాన రోడ్డులో ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. వివరాలు.. కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ అనిల్ కుందుర్పి నుంచి ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం బయలుదేరాడు. కైరేవు నుంచి ముగ్గురు కూలీలతో కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న ఆటో బచ్చేహళ్లి గేట్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఘటనలో అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఐ యువరాజ్ మాట్లాడుతూ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పేదల ఆరోగ్యానికి సర్కారు రక్ష



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: అందరికీ సంపూర్ణ ఆరోగ్యభాగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. శిబిరాలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, కీళ్ల, మోకాళ్ల నొప్పులు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు తరలివచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉరవకొండ, బెళుగుప్ప, వజ్రకరూరు మండలాల్లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 1,245 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 70 మంది వలంటీర్లు, 100 మంది ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, 60 మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, 15 మంది వైద్యాధికారులు పాల్గొన్నారు. మూడు మండలాల్లో 10 మందిని కంటి శస్త్ర చికిత్సలు, గుండె సంబంధిత చికిత్సలు, వైద్యపరీక్షలకు 80 మంది, కీళ్లు, మోకాళ్ల సంబంధిత వ్యాధులకు 140 మంది, కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు 20 మందికి అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటి హస్పిటల్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. స్త్రీల సంబధింత సమస్యలు 120 మంది, మిగితా కేసులన్నీ జనరల్ మెడిసిన్ ద్వారా చికిత్సలు అందించారు. అలాగే శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు 480 మంది చేయించుకున్నారు.

565 మందికి చికిత్సలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా హెల్త్ క్యాంపులో 565 మందికి వివిధ రకాల చికిత్సలు అందజేసినట్లు అర్బన్ హెల్త్ సెంటర్ల ఇన్‌చార్జ్ డాక్టర్ సందేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన 30 మందిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు,, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను వారు అభినందించారు.

కంటి శస్త్ర చికిత్స చేయించుకుంటా..



కంటి చూపు కనపడక తీవ్ర ఇబ్బందులు పడేదాన్ని. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లాను. కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు శస్త్ర చికిత్స ఉచితంగా చేయిస్తామన్నారు. కంటి చూపు ప్రసాదించే నా మనవుడు జగన్‌కు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.

– వేదవతమ్మ, 14వ వార్డు, ఉరవకొండ

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


రాయదుర్గం టౌన్: స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పొరాళ్ల శిల్ప, దివాకర్‌రెడ్డి


కళ్యాణదుర్గం: పట్టణంలో ప్రధాన రోడ్లను శుభ్రం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు


ఉరవకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఘనంగా స్వచ్ఛతా హీ సేవ
- శ్రమదానం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

రాయదుర్గం టౌన్/రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆదివారం రాయదుర్గం పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి పరిసరాలను శుభ్రం చేశారు. పట్టణంలోని 1, 2 వార్డుల్లో చైర్‌పర్సన్, కమిషనర్‌తోపాటు కౌన్సిలర్ నాగవేణి, వార్డు ఇన్‌చార్జ్ దివాకర్ తదితరలు పరిసరాల శుభ్రంకు శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలో స్వచ్ఛత కోసం కృషి చేయాల్సిన బాధ్యత మహిళలు, ప్రజలపై ఉంటుందన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణకు చెత్త నిర్వహణ ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లో చెత్తచెదారాన్ని కాలువల్లో వేయరాదని సూచించారు. ఇది వరకే ప్రతి ఇంటికీ మూడు రకాల బుట్టలు అందజేశారని, అందులో తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా వేసి ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో మూడు చోట్ల స్వచ్ఛత కార్యక్రమాన్ని కౌన్సిలర్లు నిర్వహించారు. కార్యక్రమంలో 2వ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలంలోని నాగిరెడ్డిపల్లి , ఆవులదట్ల సచివాలయాల పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు , వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కళ్యాణదుర్గం/శెట్టూరు/కుందుర్పి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. కళ్యాణదుర్గం పట్టణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, కౌన్సిలర్ అర్చన, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి తదితరులు బళ్లారి మిట్ట వద్ద నుంచి టీ సర్కిల్ వరకు ప్రధాన రహదారిని చీపుర్లతో శుభ్రం చేశారు. అలాగే పాత బస్టాండ్ ఆర్డీఓ, తహసీల్దార్, పోలీసుస్టేషన్, సబ్ జైలు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగు పనులు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ముప్పూరి దేవరాజ్, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం రామచంద్ర, ఏఎం మాధవి, ఎల్ హెచ్ ఫక్రుద్దీన్, మహమ్మద్ ఆజాంలతో పాటు డిపో గ్యారేజి సిబ్బంది డిపో ఆవరణాన్ని చీపుర్లతో శుభ్రం చేశారు. అలాగే శెట్టూ మండలంలోని ములకలేడు, తిప్పనపల్లి గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మంజునాథ, పార్టీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, జేఏసీ కన్వీనర్ తిమ్మరాజు, సర్పంచ్‌లు నాగరాజు, గంగన్న, నాయకులు పోస్ట్ రామకృష్ణ, హరినాథరెడ్డి, మన్సూర్, శీనా, రాజు, సంధ్యారాణి, వలంటీర్లు పాల్గొన్నారు. కుందుర్పి మండలంలోని ఎనుములదొడ్డి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో అపరిశుభ్రతను తొలగించారు. కంబదూరు ప్రాజెక్ట్ సీడీపీఓ వనుజా అక్కమ్మ సర్పంచ్ మహదేవమ్మ, సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండలో ర్యాలీ

ఉరవకొండ/కూడేరు/వజ్రకరూరు: ఉరవకొండ మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, ఎంపీడీఓ అమృతరాజ్, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో ర్యాలీతో పాటు పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో రోడ్డును శుభ్రం చేశారు. అలాగే మండలవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీసేవా కార్యక్రమానికి సర్వశిక్షఅభియాన్ జీసీడీఓ మహేశ్వరి హాజరై ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయినిలతో కలిసి పాఠశాల ప్రాంగణం శుభ్రం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణానాన్ని కార్మికులతో కలిసి డీఎం బాలాజీ దయాళ్ శుభ్రం చేశారు. అదేవిధంగా కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరకణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు శివరంజని, రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండల కేంద్రంతోపాటు గడేహోతురులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ సుశీలారాణి, సర్పంచులు మోనాలిసా, సురేంద్ర, సచివాలయ కన్వీనర్ పార్వతి, ఉపసర్పంచు మధు సూధన్‌రెడ్డి, ఈఓఆర్డి సదాశివ, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.


శెట్టూరు: తిప్పనపల్లిలో చీపురుపట్టి చెత్తను ఊడుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కూడేరు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్, ఈఓఆర్డీ


రాయదుర్గం రూరల్: నాగిరెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ కొండయ్య

నేటి నుంచి 'బడేషావలి' ఉరుసు

విడపనకల్లు: మండలంలోని వి.కొత్తకోటలో సోమవారం నుంచి బుధవారం వరకూ హజరత్ షేక్ బడేషావలి ఖాద్రీ ఉరుసు నిర్వహించనున్నారు. కులమతాలకు అతీతంగా ఉరుసు ఉత్సవాలను జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. సోమవారం గంధం ఊరేగింపు, మంగళవారం ఉరుసు ఉత్సవాలు, బుధవారం షంషేర్ నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటలకు గోవా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం చేత గొప్ప ఖవ్వాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కళ్యాణదుర్గం: లాడ్జిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ తేజమూర్తి సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని లాడ్జిలను పోలీసులు తనిఖీ చేశారు. సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది లాడ్జిల్లోని ప్రతి గదినీ క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జిలలో అద్దెకు ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ లాడ్జి పరిసరాలు కన్పించేలా సీసీ కెమెరాలకు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే జిల్లా ఎస్పీ ఫోన్ నంబర్ 9440796800కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఐరన్ మెటీరియల్ చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు, ఎస్‌బీఐ వెనుక ప్రాంతాల్లో ఉన్న వెల్డింగ్ షాపుల్లో తరుచూ ఐరన్ మెటీరియల్ చోరీకి గురవుతుండడంతో యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు నెలల నుంచి ఏదో ఒక ఐరన్ వస్తువు చోరీకి గురవుతున్నట్లు యజమానులు అమాను, నూరుల్లా, ఖుద్దాస్ తదితరులు వాపోయారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఎస్‌బీఐ వెనుక అమాను వెల్డింగ్ షాపు నుంచి చోరీ చేసి తీసుకెళుతున్న ఓ మహిళల ముఠాను గుర్తించి వెంబడించగా కూరగాయల మార్కెట్ వద్ద సామగ్రి వదిలేసి పరారైనట్లు యజమానులు తెలిపారు. వాటిని పరిశీలించగా కొన్ని రైల్వేకు చెందినవి కాగా మరికొన్ని తమ షాపుల్లో చోరీ చేసిన సామగ్రిగా గుర్తించారు. స్థానికంగా కొందరు మహిళలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని బాధితులు వాపోయారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.